



పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, జనవరి 13: ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం కోరిక నివారణ జరిగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా 16న పార్వేట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఉదయం పాలుపొంగులు, భజన కార్యక్రమాలు, కోలాటలు నిర్వహిస్తామన్నారు.


పల్లెల్లో సంక్రాంతి ఏదీ?

వెలవెలబోతున్న పల్లె లోగిళ్లు

సంక్రాంతి... తెలుగింటి పల్లె పెద్ద పండుగ. పల్లె విడిచి ఎక్కడెక్కడో బతుకుతున్న వారందరూ తమ సొంతగ్రామాలకు చేరుకుని, పండుగను మూడు రోజులపాటు ఆనందంగా జరుపుకోవడం ఆనవాయితీ. విద్య, ఉద్యోగం, కోసం వెళ్లినవారు, పొట్టకూటి కోసం వలస వెళ్లిన శ్రమజీవులు ఇలా గ్రామానికి దూరమైన ప్రతి ఒకరు గ్రామాలకు చేరుకుంటారు. ఎప్పుడో గ్రామాలను వదిలి వెళ్లిన రాజకీయ నాయకులు కూడా సంక్రాంతికి తమ గ్రామాలను గుర్తు చేసుకుంటూ పల్లె బాట పడతారు. పండగపూట ఇంటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్ది, పాలు పొంగించి, పిండి వంటలు ఆరగించి, పతంగులు ఎగురవేసి, ఎడ్ల పందేలు చూస్తూ పల్లెల్లో బంధుమిత్రులతో మూడు రోజులు ఎంతో సంబరంగా గడిపేవారు. ఇదంతా గతం తాలూకా మధుర జ్ఞాపకం.

ప్రస్తుతం ఆ కల కనుమరుగైంది. సంక్రాంతిలో కాంతి లేకుండా పోయింది. తీవ్ర వర్షాభావంతో రైతన్న ఇంట ధాన్యసిరి లేకుండా పోయింది. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం చేయూతనివ్వలేదు. కరువు మండలాలు ప్రకటించారే గాని పరిహారం మాటే లేకుండాపోయింది. పరిహారం అయినా అంది ఉంటే కనీసం పండుగ నాడు అయినా పస్తులు లేకుండా తినేవారు. పనులు లేక వలసపోయిన వారు ఇంటికి తిరిగిరాలేదు. గతంలో ప్రభుత్వం పేదలకు అందించే సంక్రాంతి కానుకలాంటివి ఈప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. దీంతో పండుగనాడు అయినా పప్పు అన్నం తినే భాగ్యం గ్రామాల్లో కనిపించలేదు. మొత్తంగా గ్రామాల్లో సంక్రాంతి సందడి కానరాకుండా పోయింది. ఈ ప్రభావం పట్టణాల్లోని వ్యాపారులపై కూడా పడింది. వ్యాపారాలు లేక వారు విలవిల్లాడుతున్నారు.

- కదిరి



పండగెలా చేసేది?..



ఈ ఏడాది సాగుచేసిన పంటలన్నీ వాన లేక ఎండిపోయాయి. పంటలకోసం పెట్టిన పెట్టుబడి సైతం చేతికి రాలేదు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి చేతులు దులుపుకుంది. పండగకు అల్లుళ్లు, ఆడబిడ్డలు ఇంటికి వస్తున్నారు. వాళ్ల కొత్త బట్టలు కొనడానికి డబ్బుల్లేవు. పెట్టకుంటే మర్యాద పోతుంది. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం సంక్రాంతి కానుకగా సరుకులు అందించినా కొంత ఊరట కలిగేది. ఏమీ లేకుండా ఇప్పుడు పండగెలా చేసేది. - **వెంకటరమణ, కోటపల్లి, తనకల్లు**



బోసిపోయిన ఎన్పీకుంట మండలంలోని బలిజపల్లి

ప్రస్తుతం గ్రామాల్లో పంటలు పండక రైతులు సంతోషంగా లేరు. బంధుమిత్రులను ఇంటికి పిలిస్తే ఖర్చవుతుందేమోనని భయపడే పరిస్థితి. నిరుద్యోగులు, యువకులు నిరుత్సాహంగా ఉన్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఊసు లేకపోవడంతో ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వెళ్లినవారు తిరిగి రాలేదు. వస్తే బోలెడు ఖర్చు అవుతుందని అక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది. కొంతమంది తల్లిదండ్రులు పనికోసం బెంగళూరు, తిరుపతి లాంటి పట్టణాలకు వలస వెళ్లి అక్కడే ఉన్నారు. బడికి సెలవులు విడిచిన తరువాత పిల్లలను కూడా అక్కడికే తీసుకెళ్లారు తప్ప గ్రామాలకు రానిపరిస్థితి. కదిరి నియోజకవర్గం అధికసంఖ్యలో గ్రామాలను కలిగి ఉంది. ఇక్కడ ఏ గ్రామంలో చూసినా పండగ సందడి కనిపించడం లేదు. నిరుద్యోగులు, ఉద్యోగులు గ్రామాలకు రాలేదు. రైతులు గ్రామాలు విడిచి పట్టణాలకు వెళ్లలేదు. చేతిలో అరకొరగా ఉన్న డబ్బులతో మండల కేంద్రాలకు వెళ్లి అరకొర సరుకులు తెచ్చుకుంటున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం కూడా ఇందుకు ఓ కారణం. కొత్త బట్టల ఊసే కనిపించడం లేదు. పట్టణాల్లో దుకాణాలన్నీ వ్యాపారాలు లేక ఖాళీగా కనిపిస్తున్నాయి.

బంధువులను పిలవాలంటే భయపడే పరిస్థితి

పంటలు పండక రైతన్న విలవిల
ప్రభుత్వ సాయం అందలేదు
వలసలతో గ్రామాలు కళావిహీనం
సంక్రాంతి కానుకతో ఊరట
దక్కేదంటున్న పల్లె జనం

సంక్రాంతికి సరుకులు లేవు



సంక్రాంతిపండుగకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం సరుకులిచ్చింది. నాలుగేళ్ల నుంచి స్టోరులో బియ్యం తప్ప ఇతర సరుకులు ఇవ్వడం లేదు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే అప్పట్లో సరుకులకు భయంలేకుండా ఉండేది. ఇప్పుడు సరుకులు కొనాలంటే అప్పు చేయక తప్పదు. సరుకులు లేకుంటే పండుగ ఎలా చేసేది.

- **పెద్దన్న, బలిజపల్లి, ఎన్పీకుంట**



గత ఖరీఫ్‌లో ఎండిపోయిన వేరుశనగ పంట (ఫైల్)

సంక్రాంతి కానుక ఏదీ?

గత ప్రభుత్వం పండుగ సందర్భంగా సంక్రాంతి కానుక పేరుతో బియ్యం, కంది బేడలు, నూనె, బెల్లం, చక్కెర, గోధుమపిండి, నెయ్యి శనగలు, మైదాపిండి అందించేది. దీంతో చిన్న, పెద్ద తేడాలేకుండా అందరూ గౌరవంగా సంక్రాంతిపండగను జరుపుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం గత నాలుగేళ్ల నుంచి సంక్రాంతి కానుకను రద్దు చేసింది. దీంతో కానుక అందక రేషన్‌కార్డు ఉన్న పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా ఇచ్చే చక్కెర, కందిబేడలుకూడా అందించలేదు. ఈక్రమంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. పండుగను జరుపుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి తప్పలేదు.




టీచర్లపై మరో యాప్ పిడుగు

విద్యార్థుల గైర్హాజరుకు కారణం నమోదు చేయాలట..!
తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు



బడికెందుకు రాలేదో..?



ధర్మవరం, జనవరి 13: విద్యార్థి పాఠశాలకు హాజరైతే టిక్ మార్కు, గైర్హాజరైతే ఇంటూ మార్కు పెట్టేవారు. వైసీపీ అధికారం చేపట్టాక ఆన్‌లైన్‌లో హాజరు వేయాలన్నారు. తాజాగా.. విద్యార్థి గైర్హాజరైతే అందుకు కారణం కూడా నమోదు చేయాలంటూ కొత్త యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందులో విద్యార్థి స్కూల్ అంటే ఇష్టం లేక రాలేదా? వలసపోయారా? ఇతర పాఠశాల నుంచి టీసీ తీసుకురాలేదా? చాలా రోజులుగా ఆబ్సెంట్ అవుతున్నాడా? అన్న కారణాల్లో సరైన దానిని నమోదు చేయాలట. బడికే రాని విద్యార్థి ఎందుకు రాలేదన్న విషయం టీచర్‌కు ఎలా తెలుస్తుంది? చెప్పేవారెవరు? విద్యార్థి ఇంటికెళ్లి తెలుసుకుని రావాలో..? ఏంటో..? అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే యాప్‌ల భారంతో బోధన కన్నా.. బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మరో కొత్త యాప్‌ను ప్రవేశ పెట్టడంపై వారు మండిపడుతున్నారు.



4 ఆప్షన్లు

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నిత్యం యాప్‌లతో యాతన పడాల్సి వస్తోంది. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులకు ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. విద్యాశాఖ ప్రవేశ పెట్టిన వివిధ యాప్‌లలో వివరాలు నమోదు చేయడానికి వారు తంటాలు పడుతున్నారు. పిల్లలకు బోధించడానికి ఎనిమిది పీరియడ్లు ఉంటే బోధనేతర పనులు నిర్వహించడానికి రోజుకు మూడు, నాలుగు గంటల సమయం పడుతోంది. వీటితోపాటు అటెండెన్స్ యాప్‌ను తీసుకురావడం, ఈయాప్ సరిగా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సరిగా లేకపోవడం తదితర కారణాలతో అటెండెన్స్ ఆలస్యమైతే వెంటనే సంబంధిత ఉపాధ్యాయుల ఫోన్లకు అధికారుల నుంచి బెదిరింపు మెసేజ్‌లు వస్తున్నాయి. తాజాగా వచ్చిన కొత్త యాప్‌లో విద్యార్థుల హాజరుకు సంబంధించి నాలుగు అంశాలను నమోదు చేయాల్సి ఉంది. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.



యాప్ రూపంలో మరో పిడుగు

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై యాప్ రూపంలో మరోపిడుగు పడింది. ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశించిన యాప్‌లతో సతమతమవుతుండగా.. కొత్తగా మరోటి వచ్చింది. కొత్త యాప్‌తో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల వచ్చిన కొత్త యాప్‌లో విద్యార్థుల హాజరుకు సంబంధించి నాలుగు అంశాలను నమోదు చేయాల్సి ఉంటుంది. రోజు ఉదయం తరగతి గదిలో మొదటి పీరియడ్‌లోనే విద్యార్థుల వివరాలను వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ ప్రకారం పాఠశాలలకు హాజరుకాని విద్యార్థి ఏ కారణంతో రాలేదన్న విషయాన్ని కొత్తయాప్‌లో స్పష్టంచేయాలి. విద్యార్థి పాఠశాలకు రాకపోవడానికి మొదటి కారణంగా నాట్ ఫీల్ గుడ్ (స్కూల్ అంటే ఇష్టం లేకనా) అని ఉంటుంది. రెండో అంశంలో వలసవెళ్లారా?, మూడో అంశం ఇతర పాఠశాల నుంచి టీసీలు తీసుకురాలేదా ?, నాలుగో అంశంపై లాంగ్ ఆబ్సెంట్ అని ఉంటుంది. వీటిలో ఏదో ఒకటి స్పష్టం చేయాలి. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఈ తరహా నమోదు పెద్ద సమస్య కాకపోవచ్చు. అధిక సంఖ్య లో విద్యార్థులుండే పాఠశాలల్లో మాత్రం తొలి పీరియడ్‌లో ఇన్ని వివరాలు ఎలా నమోదు చేయాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. యాప్‌లతోనే తమకు సమయం అంతా గడిచిపోతుంటే ఇక పాఠాలు ఎప్పుడు చెప్పాలో అర్థం కావడంలేదనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బోధనేతర పనులే అధికం

పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులకే ఉపాధ్యాయులు అధిక సమయం కేటాయిస్తున్నారు. పాఠశాలకు సమయానికి హాజరు కావడం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన ఫొటోలు అప్‌లోడ్ చేయడం, ఫేషియల్ అటెండెన్స్ అప్‌లోడ్, టీచింగ్ నోట్స్ రాయడం, వర్క్‌బుక్‌ల కరెక్షన్, సిలబస్ ఎంతవరకు పూర్తి చేశారన్న విషయాన్ని నిత్యం మెసేజ్ పెట్టడం, స్టాక్ రిజిస్టర్లు పక్కాగా నిర్వహించడం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు, అధికారుల సమావేశాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు ఇలా అనేక బోధనేతర పనుల్లో ఉపాధ్యాయులు బిజీబిజీగా ఉంటున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల్లో బోధన సకాలంలో పూర్తి చేయాలనీ, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సంసిద్ధులను చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం తమపై కక్షగట్టి వేధింపులకు పాల్పడుతోందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయులను వేధిస్తే తగిన సమయంలో తగిన రీతిలో బుద్ధి చెబుతామని వారు హెచ్చరిస్తున్నారు.

నాసిన్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన





భద్రతాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్.. పనులు పర్యవేక్షిస్తున్న భద్రతా సిబ్బంది

హిందూపురం, జనవరి 13: పాలసముద్రం వద్ద నాసిన్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ప్రధాని రాకను పురస్కరించుకుని శనివారం జిల్లా అధి కారులు అక్కడ పర్యటించారు. నాసిన్ కేంద్రంలో ప్రధానమంత్రి ప్రారంభించే భవనాలతో పాటు ఐఆర్‌ఎస్‌లో సమావేశం శిక్షణా కేంద్రాలు, మోదీ పరిశీలించే ప్రాంతాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్‌ఎల్ శర్మ, ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్పీజీ అధికారులతో మాట్లాడారు. హెలీప్యాడ్, వేదిక స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ పనులు చేస్తున్నవారిని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు ఏర్పాట్లపై ముందస్తు సెక్యూరిటీ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని హాజరయ్యే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశ, నిర్దేశం చేశారు.

ప్రధాని పర్యటనపై సీఎస్ సమీక్ష

పుట్టపర్తి, జనవరి 13: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులతో శనివారం సమీక్షించారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలతో సమీక్షించారు. ప్రధాన పర్యటనకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

విజయవంతం చేయాలి: కలెక్టర్

ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి పర్యటనపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16న ప్రధాని జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కేంద్రమంత్రులు పాల్గొనే అవకాశముందన్నారు. ఇందుకోసం సమష్టిగా, సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద నాసిన్ కేంద్రాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. పుట్టపర్తి విమానాశ్రయం పరిసరాలను, ప్రధానమంత్రి భద్రతాధికారి పీకే. యాదవ్, డీఐజీ అమ్మిరెడ్డి, కలెక్టర్, ఎస్పీ మాధరెడ్డి, ఎస్పీజీ అధికారులు, ఏర్పాట్లును పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవో భాగ్యరేఖ, వంశీకృష్ణ, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవ్విపోదురుగాక..!



మంత్రి సభా...మజాకా..





రోడ్డుకు అడ్డంగా ఏర్పాటుచేసిన సభావేదిక

చిలమత్తూరు, జనవరి 13: ఎవరేమనుకుంటే మాకేంటి? ఎవరికి ఇబ్బంది కలిగితే మాకేంటి? మా మంత్రి సభ జరగాలంతే అనేలా మండల వైసీపీ నాయకులు వ్యవహరించారు. మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పర్యటించారు. పర్యటనలో చివరి సభగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభావేదిక విమర్శలకు తావిచ్చింది. సభావేదికను ప్రధాన రోడ్డుపై ఏర్పాటుచేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం 9 గంటలకే సభా వేదికను అధికార పార్టీ నాయకులు సిద్ధం చేశారు. అప్పటి నుంచి ప్రధాన రోడ్డు మార్గాన రాకపోకలు బంద్ అయ్యాయి. కనీసం ద్విచక్రవాహనం వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి లేపాక్షి, హిందూపురం వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లేపాక్షి, హిందూపురం వెళ్లే వారు ఊర్లోకి రాకుండా బైపాస్ మీదుగానే వెళ్లవలసి వచ్చింది. ఇక బస్సులు కూడా బైపాస్ మీదుగా వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 108 వాహనంలో వచ్చే వారు కూడా ఇదే మార్గంలో రావాల్సి ఉండటంతో రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సభావేదిక అడ్డంగా ఉండటంతో 108 వాహనం ఇరుకు సందుల్లో నుంచి వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. మంత్రి పర్యటన ప్రజలకు మంచి చే యాలిగాని, ఇలా ఇబ్బందులు పెట్టడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అందని రేషన్

పండుగపూట ఇబ్బంది పడుతున్న రేషన్‌కార్డు లబ్ధిదారులు



సరుకుల కోసం ఎండీయూ వాహనం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

మడకశిర రూరల్ జనవరి 13: సంక్రాంతి పండుగా వచ్చినా పూర్తి స్థాయిలో రేషన్ కార్డు దారులకు సరుకులు అందడం లేదు. నిత్యావసర సరుకుల ధరలు చుక్కలనంటుతునన పరిస్థితుల్లో పండుగ పూట సరుకులు కొనలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండగ వచ్చిన సరుకులు ఇవ్వకపోవడంతో ఎండీయూ వాహనం ఎక్కడ నిలబెడితే అక్కడికే సరుకుల కోసం రేషన్‌కార్డుదారులు పరుగులు తీస్తున్నారు. మండలంలో 62 ఎఫ్‌పీ షాపులు, 26వేలు రేషన్‌కార్డులు, సరుకులు పంపిణీ చేయడానికి 12 వాహనాలు ఉన్నాయి. ప్రతి నెలా 3900 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. 1 నుంచి 15 వ తేదీ వరకు ఎండీయూ వాహనాలు ద్వారా వాటిని పంపిణీ చేస్తున్నారు. ఈ సంక్రాంతి పండుగకు బియ్యం రాగులు, చక్కెర, కందిపప్పు అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే చాల చోట్ల బియ్యం, రాగులు మాత్రమే ఇస్తున్నారు. మరికొన్ని షాపుల్లో బియ్యం, కందిపప్పు మాత్రమే ఇస్తున్నారు. ఎక్కడా పూర్తి స్థాయిలో సరుకులు పంపిణీ చేయడంలేదు.

పండుగలకు ప్రత్యేక సరుకులు ఎక్కడ?: నరసింహప్ప, ఎల్లోటి



టీడీపీ పాలనలో చంద్రన్న కానుక కింద 9 రకాల సరుకులు ఇచ్చేవారు. దీంతో పండుగను సంతోషంగా చేసుకునేవాళ్లం. వైసీపీ ప్రభుత్వంలో పండుగలకు ప్రస్తుతం ఇస్తున్నా సరుకులు సకాలంలో సక్రమంగా ఇవ్వడంలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

స్టాక్‌పాయింట్‌కు సరుకులు రాకపోవడంతోనే..

మడకశిర స్టాక్ పాయింట్‌కు సరుకులు ఆలస్యంగా రావడంతో సకాలంలో ఎఫ్‌పీ షాపుల్లో కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేయలేకపోతున్నాం. త్వరగా లబ్ధిదారులందరికీ పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- **హారతి, డిప్యూటీ తహసీల్దార్**

నిరసన జ్వాల



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద భోగి మంటలు వేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



జమ్మానిపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి అతికించిన నోటీసు

పుట్టపర్తిరూరల్, జనవరి 13: డిమాండ్ల సాధనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారం 33వ రోజు కొనసాగింది. జిల్లాకేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విరామం ప్రకటించగా ముదిగుబ్బ, ఎన్పీకుంట, కదిరి, ఓడీసీ, నల్లమాడ, హిందూపురం, అగళి, నల్లమాడ, ధర్మవరం, బత్తలపల్లి, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో నిరసనలు కొనసాగాయి. కాగా సమ్మె నేపథ్యంలో మీపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు జారీ అవుతున్నాయి. మడకశిర క్లస్టర్ పరిధిలో శనివారం 432 కేంద్రాలకు నోటీసులు అతికించారు.

ధర్మస్థల ట్రస్ట్ నిర్ణయం అభినందనీయం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి



గుండుమల తిప్పేస్వామిని కలిసిన ట్రస్ట్ సభ్యులు

మడకశిర టౌన్, జనవరి 13: వెనుకబడిన మడకశిర ప్రాంతం అభివృద్ధికి ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ నిర్వాహకులు వీరేంద్రహెగ్డే ముందుకు రావడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. పట్టణంలో ధర్మస్థల గ్రామణాభివృద్ధి ట్రస్ట్ డైరెక్టర్ దినేష్, సభ్యులు శనివారం గుండుమల తిప్పేస్వామిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మడకశిర ప్రాంత అభివృద్ధికి సహకారం అందించేందుకు ట్రస్ట్ నిర్ణయం తీసుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి ఈప్రాంతం అభివృద్ధి కోసం ఎన్నో సార్లు వీరేంద్రహెగ్డేను కలిసినట్లు వెల్లడించారు. మూడు నెలల క్రితం ధర్మస్థలంలో ఆయన్ను కలిసి ఈ ప్రాంత వెనుకబాటుతనం గురించి విన్నవించగా పెద్దమనసుతో అంగీకారం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ ద్వారా ఈ ప్రాంతంలో విద్యార్థులు, రైతులు, మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మాజీ సర్పంచ్ లోకేష్, నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ రవికుమార్ తదితరులు తెలిపారు.



మూడు నెలల క్రితం వీరేంద్రహెగ్డేను కలిసిన గుండుమల తిప్పేస్వామి

జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేస్తా: పల్లె



చర్చావేదికలో పాల్గొన్న పల్లె, ఐటీ యూత్

పుట్టపర్తి, జనవరి 13: సత్యసాయి బాబా సేవలకు గుర్తింపుగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డిపేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం తెలుగుయువత ప్రొఫెషనల్ వింగ్, ఐటీ జనరల్ సెక్రెటరీ తలిపినేని పాండు ఆధ్వర్యంలో కనెక్ట్ విత్ లీడర్ పేరుతో చర్చావేదిక నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు, డాక్టర్లు, టీచర్లు, లాయర్లు అడిగిన పలు ప్రశ్నలకు పల్లె క్షుణంగా సమాధానం ఇచ్చారు.

మహిళల రక్షణకు మీరు ఎలాంటి చట్టం తెస్తారని ఐటీ ఉద్యోగి శ్రీదేవి ప్రశ్నించగా.. టీడీపీ అధికారంలోకి రాగానే సమాజంలో మహిళల రక్షణకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాడానికి చేయాల్సిన ప్రయత్నమంతా చేస్తానని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉపాధి చూపుతారని బాలుకిరణ్‌రెడ్డి ప్రశ్నించగా.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగయువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కియ ద్వారా చంద్రబాబు 13వేల ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. కొత్తచెరువులో 30పడకల ఆస్పత్రి, బీసీ హాస్టల్ పూర్తికాలేదు, వాటిని మీరేమి చేస్తారని మధుసూదన్ ప్రశ్నించగా.. పెండింగ్‌లో ఉన్న 30పడకల ఆస్పత్రి, హాస్టల్ నిర్మాణం, స్టేడియం, టి డ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని చెప్పారు. 2023 ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తారా? అని న్యాయవాది శ్రీనివాసులు ప్రశ్నించగా.. ఆ చట్టాన్ని రద్దు చేయడంతోపాటు రైతులకు భూమిపైన న్యాయమైన హక్కులు కల్పిస్తామని పల్లె సమాధానమిచ్చారు. ఆరోగ్యశ్రీ అమలుపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని వైద్యుడు రాంప్రసాద్ అడగ్గా.. ఆ పథకంలో రోగాల పరిమితి పెంచుతూ.. మంచి వైద్య అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇవికాకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రోగులను ఆదుకుంటామని తెలిపారు. ప్రెస్‌క్లబ్, ఇంటిస్థలాల సమస్య పరిష్కరిస్తారా? అని విలేకరి మహేష్ ప్రశ్నించగా.. జర్నలిస్టులకు జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్ నిర్మించడంతో పాటు, ఇంటిపట్టాలు అందచేస్తామని చెప్పారు. జిల్లా కేంద్రాన్ని మారుస్తారా? అని జనసేన నాయకుడు అబ్దుల్ ప్రశ్నించగా జిల్లా కేంద్రం మార్పు ఉండదని, ఒకేచోట కలెక్టర్ కార్యాలయంలోపాటు అన్నికేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఆధ్యాత్మిక కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పల్లె సమాధానమిచ్చారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



కొక్కంటి క్రాస్‌లో అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

తనకల్లు, జనవరి 13: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో శనివారం అయోధ్య రాముడి అంక్షితలను ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత జైశ్రీరామ్ నిదానాలతో వాటిని ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్యలో నూతనంగా నిర్మించినా ఆలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, ఆ రోజున ప్రజలు ఇంటి ముంగిట దీపాలు వెలిగించి ఈ అక్షింతలను తలపై జల్లుకుని శ్రీరాముడిని స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలసముద్రం ఎంపీటీసీ సభ్యుడు అమరకార్తికేయ, పలువురు యువకులు పాల్గొన్నారు. అలాగే నల్లమాడ మండలకేంద్రంలోని రామస్వామి ఆలయంలోనూ అయోధ్య రాముడి అక్షింతలను ప్రజలకు అందించారు. పంపిణీ చేసిన వారిలో బుట్టి నాగభూషణంనాయుడు, లక్ష్మీనారాయణ, కరణం రమేష్, ఆదిమూలం అశోక్‌గుప్తా, రవీంద్ర గుప్తా, మనోహర్, పొరకల రామాంజనేయులు, అరవింద్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్దెలచెరువులో భవిష్యత్తుకు గ్యారెంటీ



కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

తాడిమర్రి, జనవరి 13: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలు మేలు చేస్తారని తెలిపారు. వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, ఫక్కీర్‌రెడ్డి, సుధాకర్, భాస్కర్‌గౌడ్, కుళ్లాయిరెడ్డి, రవీంద్రనాయుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేయాలి: డీఎం

ధర్మవరం, జనవరి 13: ధర్మవరం ఆర్టీసీ డిపోను అభివృద్ధి చేసి జిల్లాలోనే అగ్రస్థానంలో ఉండే విధంగా చూడాలని డిపో మేనేజర్ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని డిపో ఆవరణలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత డిసెంబరులో కేఎంపీఎల్, ఈపీకే సాధించిన ఉద్యోగులకు డీఎం నగదు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు ధర్మవరం డిపోను లాభాల బాటలోకి తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. అలాగే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి వెంకటేశులు, ఏడీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు సామాజిక న్యాయం జరగాలి

నల్లమాడ, జనవరి 13: వడ్డెర్లకు సామాజిక న్యాయం జరగాలని వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం పేర్కొన్నారు. మండలంలోని చెరువువాండ్లపల్లి, కొత్తపల్లి, చిల్లగోర్లపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆయన వడ్డెర సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. వడ్డెర్లకు సామాజిక న్యాయం జరగాలంటే వడ్డెరకులస్థులందరూ కలిసికట్టుగా పోరాటాలు చేయాలని సూచించారు. అప్పుడే తమను ప్రభుత్వాలు గుర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పల్లపు జయచంద్రమోహన్, రమణ, క్రిష్ణ, హరి, రామక్రిష్ణ, గంగులప్ప, రమణప్ప పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన కల్పించాలి

ముదిగుబ్బ,జనవరి13: కుష్టు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర కుష్టు నివారణ డైరెక్టర్ దేవ సాగర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ మండలంలో ఎంత మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నారు, వారికి ఎలాంటి చికిత్స అందిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కుష్టును సకాలంలో గుర్తించి.. చికిత్స అందిస్తే నయమవుతుందని తెలిపారు. కుష్టునివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కుష్టు నియంత్రణ జిల్లా అధికారి తిప్పయ్య, మండల వైద్యాధికారి రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

పుట్టపర్తిరూరల్, జనవరి 13: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం రవాణాపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మద్యం అక్రమ రవాణాపై దాడులు చేసినట్లు సెబ్ అధికారులు ఓప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని తూముకుంట చెక్‌పోస్టు వాహన తనిఖీలో ఒక వ్యక్తిపై ఎన్డీపీఎల్ కేసు నమోదు చేసి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే కదిరి సెబ్‌స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై ఎన్డీపీఎల్ కేసు నమోదు చేసి 60 ప్యాకెట్ల కర్ణాటక మద్యం, పుట్టపర్తి సెబ్‌స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై ఎన్డీపీఎల్ కేసు నమోదు చేసి 15ప్యాకె ట్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. మడకశిర సెబ్‌స్టేషన్ పరిధిలో రెండు ఎన్డీపీఎల్ కేసులు నమోదు చేసి 43 మద్యం ప్యాకెట్లు, తనకల్లు సెబ్‌స్టేషన్ పరిదిలో ఒక వ్యక్తిపై ఎన్డీపీఎల్ కేసు నమోదు చేసి 20 మద్యంప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, సీకే పల్లి సెబ్‌స్టేషన్ పరిదిలోని నేలకోటతండాలో, ధర్మవరం మండలంలో 150లీటర్ల చొప్పున బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సెబ్ కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

33వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

● సమస్యలను పరిష్కరించే వరకు తగ్గేదేలేదని స్పష్టం చేసిన అంగన్‌వాడీలు



నంబులపూలకుంట అంగన్‌వాడీలు సమ్మె కొనసాగిస్తున్న దృశ్యం



ఓడీసీలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ధర్మవరం, జనవరి 13: సమస్యల పరిష్కారం కోసం పట్టణంలోని అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద రోడ్డుపైనే భోగి మంట వేసుకుని నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యల్ని పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వీరికి ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ నాయకులు ఆదినారాయణ మద్దతు పలికారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలో బస్ షెల్టర్ వద్ద అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో గల సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించమని ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, కార్యదర్శి రంగమ్మ, మణిమాల పేర్కొన్నారు. వీరికి సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, శ్రీరాములు మద్దతు పలికారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వారికి సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, రమణ మద్దతు పలికారు.

కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

● మద్యంతో పాటు డబ్బు, మారణాయుధాలు స్వాధీనం



అరెస్టు అయిన నిందితులతో సీఐ నారాయణరెడ్డి



స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు, డబ్బు

కదిరి, జనవరి 13: కర్ణాటకనుంచి అక్రమం మద్యం తరలిస్తూ, అలాగే అక్రమ ఆయుధాలు కలిగిన ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కదిరి పట్టణానికి చెందిన షేక్ ఖాజావలీ, షేక్ వలీబాషా, పఠాన్ ముజాయిద్దీన్ అలియాజ్ ముజు గతంలో పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారన్నారు. పోలీసులు నిఘా ఉంచడంతో కొద్దిరోజులుగా ప రారీలో ఉన్నారని తెలిపారు. అయితే మదనపల్లిరోడ్డు పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీలో వీరు మద్యంను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు నానా దర్గావద్ద బైక్‌లో అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారని, కాగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని సోదాలు చేశారని చెప్పారు. ఇందులో వారి నుంచి 288 టెట్రా ప్యాకెట్లు, 90 ఎంఎల్ బాటిళ్లు, రూ. రెండు లక్షల వెయ్యి నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరి మద్యం తరలించే సమయంలో మార్గంమధ్యలో ఎవరైనా బెదిరించినా, ప్రశ్నించినా చంపడానికి కత్తి, గొడ్డలి, కొడవలిని వెంట బెట్టుకుని తిరుగుతున్నారని, వాటిని కూడా స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని అన్నారు. తర్వాత మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచి సబ్‌జైలుకు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాబ్‌జాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ల అరెస్టు

● 43.9 గ్రాముల బంగారు నగలు రికవరీ

● ద్విచక్రవాహనంతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



అర్బన్‌పోలీసు స్టేషన్‌లో చోరీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

పుట్టపర్తిరూరల్, జనవరి 13: జిల్లాకేంద్రం సమీపంలో వరుసగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముఠాను పుట్టపర్తి అర్బన్‌పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లమాడ మండలం చౌటుకుంటపల్లికి చెందిన మల్లెల వినోద్‌కుమార్, బడవాండ్లపల్లికి చెందిన కుంచెపు చంద్రమోహన్, కుటాలపల్లికి చెందిన మూడేకుల రవీంద్రనాయక్, దుద్దుకుంట కిరణ్‌కుమార్ అనే నలుగురు యువకులు ముఠాగా ఏర్పడి పుట్టపర్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో వరుస చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. గత జూలై 23 నుంచి ఈనెల 9 వతేదీ వరకు పలుప్రాంతాల్లో మహిళల మెడల్లో తాళిబొట్లు చైన్లను బలవంతంగా లాక్కొని వెళ్లారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు జరిపి ఆ నలుగురు ముద్దాయిలను అరెస్టు చేశారు. అనంతరం వారి నుంచి 43.9 గ్రాముల బంగారు నగలను రికవరీ చేశారు. అలాగే నాలుగు సెల్‌ఫోన్లను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలు వరుసగా బంగారు గొలుసుల దొంగతనాలకు పాల్పడి అనంతరం వాటిని పలు గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల్లో బంగారు తాకట్టు పెట్టారన్నారు. దీంతో పోలీసులు నిందితులతో పాటు ఆయా ఫైనాన్సు కంపెనీల వద్దకు వెళ్లి బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మొదటి సారి చోరీకి గురైన బంగారు గొలుసును వేలం వేశారని, దానిని సైతం రికవరీ చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. బంగారు నగల చోరీ కేసును ఛేదించిన అర్బన్‌సీఐ కొండారెడ్డి, ఎస్సైలు వీరేష్, వెంకటరాముడు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

● రాత్రి సమయంలో నిర్మాణ పనులు చేయిస్తున్న వైసీపీ నేత

● మొద్దునిద్రలో మున్సిపల్ అధికారులు



ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న ఇంటినిర్మాణం

కదిరి, జనవరి 13: పట్టణంలోని అడపాలవీధిలో ఉన్న సర్వే నంబరు 206లో గల ప్రభుత్వ స్థలంలో వైసీపీ నాయకుడు కుర్లి శివారెడ్డి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. కాగా శనివారం సాయంత్రం పనులు కొనసాగిస్తుండడంతో ఇది తెలిసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ వెంటనే మున్సిపల్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఆ స్థలం వద్దకు వెళ్లారు. అక్కడ నిర్మాణం చేస్తున్న ముగ్గురు యువకులను టీడీపీ నాయకులు ఎవరు మీరని ప్రశ్నించారు. ఈలోపే సీఐ నారాయణరెడ్డి అక్కడికి చేరుకుని వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. గత 15 సంవత్సరాలుగా ఈప్రభుత్వ స్థలం వివాదంలో ఉంది. ఇందులో ఇచ్చిన పట్టాలను సైతం రద్దు చేశారు. అయినా వైసీపీ నాయకుడు కుర్లి శివారెడ్డి తనకు పట్టా ఉందని గతంలో ఇంటి నిర్మాణం మొదలుపెట్టాడు. రెండు మార్లు రాత్రికి రాత్రే పనులు చేయించాడు. అప్పట్లో కందికుంట ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దీన్ని వ్యతిరేకించి పనుల్ని అడ్డుకున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ స్థలంలో ఉన్న ఈనిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేయలేదు. ఈనిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవు, అయినా దీన్ని కొనసాగిస్తున్నారు. వైసీపీ నాయకులు రాత్రికి రాత్రే దీని నిర్మాణం చేపట్టాలని గుట్టు చప్పుడుకాకుండా శనివారం సాయంత్రం నుంచి పనులు మొదలుపెట్టారు. ఈవిషయం తెలియడంతో కందికుంట అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇంతజరుగుతున్న మున్సిపల్ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. మున్సిపల్ అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ వారు చేసే కబ్జాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.



పనుల్ని అడ్డుకునేందుకు వచ్చిన కందికుంట

జనసేన ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

● పెద్దఎత్తున తరలివచ్చిన మహిళలు

● విజేతలకు బహుమతులు అందజేసిన చిలకం మధు



ముగ్గులను తిలకిస్తున్న చిలకం మధు దంపతులు

ధర్మవరం, జనవరి 13: పట్టణంలో సంక్రాంతి శోభ ఉట్టి పడింది. మహిళలు తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా రంగురంగుల ముగ్గులను వేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. పట్టణంలోని అన్నపూర్ణేశ్వరి ఆలయ సమీపంలోని జనసేన కార్యాలయం ఎదుట ఆవరణలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలో సుమారు 150మంది మహిళలు తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతల ఎంపికకు పట్టణానికి చెందిన హరిత, ప్రసన్న, లతాదేవి, దుర్గా, వీరనారాయణమ్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి అందజేశారు. ప్రథమ బహుమతి కింద ప్రసన్నలక్ష్మికి రూ.5016, ద్వితీయ బహుమతి కింద సౌజన్య, సాయిసుష్మ, శ్రీదేవి, మణిమాలకు ఒక్కొక్కరికి రూ. 2016 చొప్పున అందజేశారు. అలాగే తృతీయ బహుమతి కింద నాగజ్యోతి, చంద్రకళ, జయశ్రీ, భాగ్యలక్ష్మీ, నారాయణమ్మ, రేణుక, ప్రియాంక, ఉమామహేశ్వరి, భవాని, మానసకు ఒక్కొక్కరికి రూ.1016లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగుప్రజలకు ప్రత్యేకమైనదన్నారు. ఈ పండుగతో తెలుగు సంస్కృతీసాంప్రదాయాలు ఉట్టిపడతాయన్నారు. రైతులు పండించిన పంటను ఇంటికి తెచ్చుకుని పండగను సంతోషంగా చేస్తారన్నారు. ప్రజలు తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలు మరుగున పడకుండా కాపాడాలని సూచించారు. ఆ రంగవల్లుల పోటీ ప్రాంగణంలో గంగిరెద్దు చేసిన విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు, పార్టీ రూరల్ కన్వీనర్ నాగసుధాకర్‌రెడ్డి, బత్తలపల్లి మండల కన్వీనర్ పుర్రంశెట్టిరవి, ముదిగుబ్బ మండల కన్వీనర్ గుర్రంజయచంద్ర, నాయకులు అడ్డగిరిశ్యాంకుమార్, గొట్లూరుజీవీ, కోటికిరామాంజి, కడపలసుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కప్పలబండలో ముగ్గుల పోటీలు

పుట్టపర్తి: మండలంలోని కప్పలబండలో శనివారం పీఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జర్మనీకి చెందిన సత్యసాయి భక్తురాలు మౌనికఅన్నామున్నార్ తన స్నేహితులతో కలిసి తిలకించారు. అనంతరం ముగ్గులు వేసిన మహిళలకు బహుమతులు అందించి అభినందించారు. భారతీయ సంస్కృతి చాలగొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుతులు అందజేస్తున్న సాయి భక్తురాలు మౌనిక అన్నామున్నార్

కోడిపందెలు ఆడితే కఠిన చర్యలు

గాండ్లపెంట, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు ఆడితే కఠిన చర్యలుంటాయని ఎస్ఐ వెంకటనారాయణ హెచ్చరించారు. మండలంలోని కటారుపల్లిలో శనివారం ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా వినోదం కోసం కోడిపందేలు, జూదాలు ఆడకూదన్నారు. అలా ఆడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో నేడు అఖండ జ్యోతి దర్శనం

ఓబుళదేవరచెరువు, జనవరి 13: మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు అఖండజ్యోతి దర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయలు నాయుడు శనివారం తెలిపారు. ఉదయం గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప మూలవిరాట్‌లకు ప్రత్యేకాభిషేకాలు, పూజలు జరుగుతాయన్నారు. అనంతరం సాయంత్రం 6గంటలకు 18 కిలోల కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దర్శనం చేసుకోవాలని కోరారు.

అయ్యప్ప ఆలయానికి మండలకేంద్రానికి చెందిన జొగ్గి రత్నమ్మ, రుద్రారెడ్డి దంపతులు రూ.పదివేలు విలువ చేసే పంచలోహ అఖండదీప దిమ్మెలను వితరణ చేసినట్లు ఆంజనేయులు నాయుడు తెలిపారు.

ఈవీఎంలపై అపోహలను తొలగించండి

ధర్మవరం, జనవరి 13: ఈవీఎంలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని రిటైర్డ్ సబ్ జైలు అధికారి, టీడీపీ నాయకుడు వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈవీఎంలలో కొన్ని లోపాల వల్ల ఓటు వినియోగం సరిగా జరగడం లేదని కొన్ని రాజకీయపార్టీలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయన్నారు. వీటిని నివృత్తి చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా దేశ మొత్తం మీద ఒకేసారి ఎన్నికలు జరిగినప్పుడు వారం లేక .. పది రోజుల్లో పోలింగ్, కౌంటింగ్ ముగిసేవని, అదే ఈవీఎంలు వచ్చాక ఎన్నికలు జరిగిన అనంతరం రోజుల తరబడి కౌంటింగ్ కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. పోలింగ్, కౌంటింగ్‌లు వారంలేదా పదిరోజుల్లో ముగిసేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా బెట్టింగ్‌లను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

కదిరిఅర్బన్, జనవరి 13: బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, తగు పరిష్కారం కోసం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు చింతా నాగరాజు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీల కులగణన, ,చట్టసభల్లో రిజర్వేషన్లు, బీసీల జనాభా దామాషా ప్రకారం, ప్రభుత్వ, ప్రైవేటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తదితరాలపై ఈసమావేశంలో చర్చిస్తామన్నారు. పార్టీలకతీతంగా బీసీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బలిజ సంఘం మండల కమిటీ ఎన్నిక

ఓబుళదేవరచెరువు, జనవరి 13: మండలంలోని వేమారెడ్డి పల్లి సమీపంలో శనివారం బలిజల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇందులో మండలనూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బైరిశెట్టి, ఉపాధ్యక్షులుగా శెట్టివారి రమేష్‌కుమార్, బోడెద్దుల అశ్వర్థప్ప, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కార్యదర్శులుగా కుమార్ రాయల్, మురళీమోహన్, హరిప్రసాద్, గందోడి నాగరాజు, కోశాధికారిగా కమ్మల బాలాజీ, ఈసీ సభ్యులుగా నరేంద్ర, హరిబాబు, బాలక్రిష్ణ, వెంకటరమణ, లోకేష్, జశ్వంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జిల్లా నాయకుడు సంగాల సుధాకర్, ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలకేంద్రంలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఏర్పాటుకు అయ్యే ఖర్చును తామే భరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దరాసు సుబ్రమణ్యం, చింతకుంట రమేష్‌బాబు, పసుపులేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మగ్బూల్ సమావేశానికి జనం కరువు

కదిరి, జనవరి 13: మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్ శనివారం నిర్వహించిన సమావేశానికి జనం కరువయ్యారు. ముఖ్యంగా ఆ గ్రామంలో ఉన్న ఇద్దరు వార్డు కౌన్సిలర్లతో పాటు మున్సిపల్ మాజీ ఛైర్మన్ కేవీ రమేష్‌రెడ్డి సైతం దూరంగా ఉన్నారు. కేవలం ఓవర్గానికి సంబధించిన వారు మాత్రమే హాజరయ్యారు. సమావేశంలో మూడు వార్డులకు కలిపి కనీసం 30మంది కూడా రాలేదని మరో వర్గం వారు చెబుతున్నారు. ఇన్‌చార్జి మగ్బూల్ సమావేశం కుటాగుళ్లలో ప్లాప్‌షో అయిందని విమర్శిస్తున్నారు. వచ్చిన జనంలో సగం మంది కదిరినుంచి వచ్చినవారే ఉన్నారని చెబుతున్నారు. మొత్తం మీద జనం రాక నూతన ఇన్‌చార్జికి కుటాగుళ్లలో ఘోర పరాభవం ఎదురైంది.

క్రీడాకారిణికి సన్మానం

కదిరి అర్బన్, జనవరి 13: రాష్ట్రస్థాయి హెడ్‌బాల్ క్రీడాపోటీలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పట్టణంలోని వాల్మీకి పాఠశాల విద్యార్థిని నక్షత్రను విజయలక్ష్మి ఫౌండేషన్ వారు శనివారం సన్మానించారు. స్థానిక టీడీపీ నాయకుడు క్రిష్ణమూర్తి నివాసంలో ఆ విద్యార్థినిని సన్మానించి రూ.పదివేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో హెడ్‌బాల్ అసోసియేషన్ సభ్యుడు వంశీ ఉన్నారు.

చీకిరేవులపల్లిలో వికసిత్ సంకల్ప యాత్ర

అమడగూరు, జనవరి 13: మండలంలోని చీకిరేవులపల్లిలో ఎంపీడీఓ గడ్డం మునెప్ప ఆధ్యక్షత శనివారం వికసిత్ సంకల్పయాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు ప్రతిఒక్కరికీ అందాలన్న ఉద్దేశ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. అనంతరం ప్రజలకు కేంద్రం అమలు చేసిన సంక్షేమపథకాల గురించి వివరించారు. తర్వాత అభయ హస్తం కార్డులను అందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు,బీజేపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యకార్మికులకు దుస్తుల పంపిణీ

పుట్టపర్తిరూరల్, జనవరి 13: జిల్లాకేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద తెలుగుదేశంపార్టీ నాయకులు జరిపిటి కృష్ణమూర్తి,దళవాయి వెంకటనారాయణ, వడ్డేసిమెంట్ పోలన్న మున్సిపల్ కార్మికులకు శనివారం నూతన వస్త్రాల పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేయడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు.



కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



డెప్యూటేషన్ కేరాఫ్ జేఎన్‌టీయూ



- ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగం.. ఇతర విభాగాల్లో ప్రొఫెసర్ల సేవలు
- కుంటు పడుతున్న బోధన
- విద్యార్థి సంఘాల ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, జనవరి 13: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల డెప్యుటేషన్‌లకు కేరాఫ్‌గా మారడంతో బోధన కుంటు పడుతోందని ఉద్యోగ, విద్యార్థి వర్గాలనుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాలను విస్మరించి పదవుల వ్యామోహంతో బోధన వృత్తికి, విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడుతున్నాయి. ఏకంగా పదిమంది ప్రొఫెసర్లు కళాశాలను వీడితే పాఠాలు ఎలా పూర్తిచేస్తారన్న ఇంగిత జ్ఞానం ప్రభుత్వానికి లేకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. పాఠాలు బోధించాల్సిన ప్రొఫసర్‌లు ఇతర పదవులను చేపట్టాలనుకుంటే ప్రొఫెసర్ వృత్తికి రాజీనామా చేసి వెళ్తే అటు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం, ఇటు మా పిల్లలకు పూర్తిస్థాయి న్యాయం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇదేంటని ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే.. ఐదు సంవత్సరాలు పనిచేసిన వారు ఒక సంవత్సరం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోకి, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోకి ఎన్ని సంవత్సరాలైనా డెప్యుటేషన్‌మీద వెళ్లేందుకు రూల్స్ ఉన్నాయంటూ సమాధానం చెబుతున్నారు. అయితే విద్యార్థులకు అన్యాయం చేసే రూల్స్ ఏంటని ప్రశ్నిస్తున్నారు.

దక్కని విజ్ఞాన భాగ్యం

ఉద్యోగ జీవితాన్ని ప్రసాదించిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కొంతమంది ప్రొఫెసర్లు పాఠాలు బోధించే భాగ్యాన్ని నోచుకోలేకపోతున్నారు. వారి దశాబ్దాల బోధన అనుభవాన్ని, విజ్ఞానాన్ని విద్యార్థులకు పంచలేకపోతున్నారు. మంచి అనుభవమున్న ప్రొఫెసర్‌ల జ్ఞానాన్ని తమ పిల్లలు పొందలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సాధారణ అధ్యాపకులు ఒక రోజు సమయం బోధించే పాఠాల సారాంశాన్ని అనుభవమున్న ప్రొఫెసర్ ఒక పీరియడ్‌లో అర్థవంతంగా, సులువుగా బోధిస్తారు. వారి అనుభవం తమకు అందని ద్రాక్షగా మారిందని విద్యార్థులు పేర్కొంటున్నారు. పేరుకే వారు యూనివర్సిటీల్లో కొనసాగుతున్నారన్నారు.

ప్రొఫెసర్ల వారీగా పనిచేసిన విభాగాల వివరాలు...

పేరు	బ్రాంచ్	విభాగాలు	సంవత్సరం
రంగజనార్దన	మెకానికల్	ఏపీపీఎస్‌సీ	2017-20
		జేఎన్‌టీయూ వీసీ	2021-
హేమచంద్రారెడ్డి	మెకానికల్	రాష్ట్ర ఉన్నత విద్యామండలి	2019-
దినేష్ శంకర్‌రెడ్డి	కెమికల్	ఎన్ఐటీ, తాడేపల్లిగూడెం	
ఆనందరావు	కంప్యూటర్ సైన్స్	రాయలసీమ యూనివర్సిటీ	2021-23
బాల నరసయ్య	కెమికల్	జేఎన్‌టీయూ హైదరాబాద్	2021-23
చంద్రశేఖర్	ఫిజిక్స్	క్రిష్ణ యూనివర్సిటీ	2021-23
దేవకుమార్	మెకానికల్	టీసీడీఈ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి	2022-
చంద్రమోహన్‌రెడ్డి	ఎలక్ట్రానిక్స్	క్యూఏసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి	2024-
విజయకుమార్	ఎలక్ట్రికల్స్	ఆర్జీయూకేటీ	2023-
జయలక్ష్మి	మ్యాథ్స్	క్రిష్ణ యూనివర్సిటీ	2021-23

వేరేవాళ్లతో పాఠాలు చెప్పిస్తున్నాం

- ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్



విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వేరేవాళ్లతో పాఠాలు చెప్పిస్తున్నాము. ప్రతి బ్రాంచ్‌లోనూ టీచింగ్ అసిస్టెంట్లున్నారు. ప్రొఫెసర్‌లు డిప్యుటేషన్‌పై వెళ్లినప్పుడు టీచింగ్ అసిస్టెంట్లే పాఠాలను పూర్తిచేస్తారు. హేమచంద్రారెడ్డి, దేవకుమార్, చంద్రమోహన్‌రెడ్డి డిప్యుటేషన్‌పై ఉన్నారు. అదేవిధంగా ఆనందరావు, చంద్రశేఖర్ రావు, జయలక్ష్మి, బాల నరసయ్య మూడు సంవత్సరాలపాటు డిప్యుటేషన్‌పై వెళ్లి గత నెలలో తిరిగివచ్చారు. డిప్యుటేషన్ వెళ్లి వచ్చిన రంగజనార్ధన వీసీగా పనిచేస్తున్నారు. ఆర్జీయూకేటీ వీసీ(ఎఫ్ఏసీ)గా విజయకుమార్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్‌గా దుర్గాప్రసాద్ పనిచేస్తున్నారు. తాత్కాలిక ప్రాతిపదిన వెళ్లిన దినేష్ శంకర్‌రెడ్డి ఆర్నెళ్లక్రితం తన ఉద్యోగానికి రాజీనామాచేశారు.

విద్యార్థులకు అన్యాయం

- లక్ష్మీ నరసింహ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు.

పాఠాలు చెపాల్సిన ప్రొఫెసర్లను డిప్యుటేషన్‌పై వివిధ శాఖల్లోకి తీసుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రొఫెసర్లను ఇతర విధుల్లోకి ఎలా పంపుతారు. విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలి అనుభవం, విజ్ఞానం అధికంగా పెంపొందించుకున్న ప్రొఫెసర్‌లు పదవుల కోసం పాకులాడుతున్నారు. వారి పదవుల కాంక్ష కళాశాలపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో కళాశాల పరీక్షల ఫలితాల్లో ఏ ఒక్క సెమిస్టర్ 80శాతం దాటలేదు.




దొంగలకూ.. పండుగే.!



- సంక్రాంతికి వెళ్తున్నారా.. ఇళ్లు భద్రం
- ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌తో పోలీసుల నిరంతర నిఘా

ధర్మవరం, జనవరి 13: సంక్రాంతి పండుగకు ఊరెళ్తున్నారా.. విద్యాసంస్థలకు పది రోజులు, అధికారులకు శనివారం నుంచి నాలుగురోజుల పాటు సెలవులు ఉండటంతో ఇంటిల్లిపాది సొంతూళ్లకు పయనమవుతున్నారు. అయితే తాళం వేసిన ఇళ్లను దోచుకునేందుకు దొంగలు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటియజమానులు జాగ్రత్తలు వహించాలని, లేకపోతే చోరీలు తప్పవని పోలీసులు కొన్ని హెచ్చరిస్తున్నారు.

- ఇళ్లకు తాళాలు వేసుకొని సొంతూళ్లకు వెళ్లే ప్రజలు పోలీసు శాఖ రూపొందించిన లాక్డ్ హౌస్‌మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్)సేవలను సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలకు అరికట్టవచ్చు.
- స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లో ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌నుడౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరచాలి. మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ కావాలి. లాగిన్ అయిన వెంటనే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదు చేశాక యూనిక్ ఐడీ వస్తుంది. దీంతో ఎల్‌హెచ్ఎంఎస్‌లో నమోదు పూర్తవుతుంది.



ఎల్‌హెచ్ఎం ఎస్ యాప్

ఎల్‌హెచ్ఎంఎస్ వినియోగం: ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే ప్రజలు ముందుగా ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళ్తున్నారు. తిరిగి ఎప్పుడువస్తారు అన్న వివరాలు యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమరాలను అమరుస్తారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోల్ట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. పోలీసులు దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునే అవకాశం ఉంటుంది.

గస్తీ పెంచుతున్నాం : సుబ్రహ్మణ్యం, వన్‌టౌన్ సీఐ, ధర్మవరం



సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకునేందుకు సొంతూళ్లకు వెళ్తున్నప్రజలు కొన్నిజాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్‌హెచ్ఎంఎస్ సేవలను ఉపయోగించుకోవాలి. ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు ఉంచవద్దు. బ్యాంకు లాకర్‌లో జాగ్రత్త చేసుకోవడం మంచిది. పండుగలను దృష్టిలో ఉంచుకొని రాత్రిపూట గస్తీ పెంచుతున్నాం.

పశ్చిమ బెంగాల్ కార్మికులు సేఫ్

- ఎంపీ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు
- తహసీల్దార్ ఎదుట హాజరు పరిచిన రూరల్ పోలీసులు



పశ్చిమ బెంగాల్ కార్మికులతో పోలీసులు

అనంతపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'మా వాళ్లను మీ ఎమ్మెల్యే' నిర్బంధించారు శీర్షికన ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనంపై జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించింది. అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి నేతృత్వంలో స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు కార్మికశాఖ అధికారులు ఉదయమే కొడిమి జగనన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడ కార్మికులతో నిర్బంధం విషయంపై ఆరా తీశారు. అనంతరం ఇక్కడ కార్మికులను ఎవరూ నిర్బంధించలేదంటూ డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. తమ కూలీలు నిర్బంధంలో ఉన్నారని పశ్చిమబెంగాల్ ఎంపీ ఏహెచ్ ఖాన్‌చౌదరి, జగనన్న ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టర్ సర్వార్‌జహాన్ ద్వారా కలెక్టర్, ఎస్పీలకు ఫ్యాక్స్, మెయిల్ పంపారు. తమ కార్మికులను కాపాడాలని విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం, అధికార పార్టీ నాయకుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఇది జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. నిర్బంధంలో ఉన్న తమ కార్మికుల ఆచూకీ తెలపడంతో పాటు వారిని కాపాడాలంటూ కాంట్రాక్టర్ సర్వార్‌జహాన్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీపీ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో పాటు అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను రెస్పాండెంట్స్‌గా చేర్చారు. హైకోర్టులో ఈ పిటీషన్ వేయడంతో పోలీసులు ఈ అంశాన్ని మరింత సీరియస్‌గా తీసుకున్నట్లు అర్థమవుతోంది. ఈక్రమంలోనే నిర్బంధానికి గురయ్యారని చెబుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన 9 మంది కార్మికులను అనంతపురం రూరల్ తహసీల్దార్ ఎదుట శనివారం రాత్రి అనంతపురం రూరల్ పోలీసులు హాజరు పరిచారు. తమను ఎవరూ నిర్బంధించలేదని, నిర్బంధించి పని చేయించుకోవడం లేదని ఆ కార్మికులతో వాంగ్మూలం తీసుకున్నారు. ఇదంతా చూస్తుంటే దీనివెనుక పెద్ద తతంగమే నడిచిందనడంలో సందేహం లేదు.

బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- ఎస్కేయూలో 30మంది ఉద్యోగుల సస్పెన్షన్
- సెంట్రల్ యూనివర్సిటీల్లో బ్రాహ్మణులకే ఉద్యోగాలు
- నేతల ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, జనవరి 13: దేశంలో అత్యధిక జనాభా కల్గిన బీసీలను ప్రభుత్వాలు, పాలకులు విస్మరిస్తున్నారని పలువురు బీసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ/ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామాహాల్‌లో శనివారం 'పూలే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం' నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నేతలు మాట్లాడుతూ ఎస్కేయూలో ఏకంగా 30 మంది బీసీ ఉద్యోగులను సస్పెండ్‌చేసి అగ్రవర్ణాలకు అడ్డంగా ఉద్యోగాలు, ప్రమోషన్‌లు కట్టబెట్టారని, సెంట్రల్ యూనివర్సిటీలో బ్రాహ్మణులకే ఉద్యోగాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను బీసీనే అని చెప్పుకునే ప్రధాని అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే క్లాక్‌టవర్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి మహాత్మా జ్యోతిరావుపూలే పేరు పెడతామన్నారు. బీసీ స్టడిసర్కిల్స్, శుభకార్యక్రమాలు నిర్వహించేందుకు బీసీ భవన్‌ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు పురస్కారాలందజేసి కులగణన, 15 డిమాండ్లతోకూడిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి పాండురంగయ్య, రాష్ట్ర ప్రధాని కార్యదర్శి పుట్టాశ్రీధర్, ఉపాధ్యక్షులు నాగభూషణం, కార్యదర్శి బలరాముడు, గోగుల శ్రీధర్, నాగరాజు, వివిధ సంఘాల నాయకులు పోతుల రాధాకృష్ణ, డాక్టర్ రామచంద్ర, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, నరహరి, అక్కులప్ప, ఓబిలేసు, ఉమామహేశ్వర్, బీరప్ప, మాజీ ప్రిన్సిపాల్ రంగస్వామి, జాకీర్ హుస్సేన్, పెద్దన్న, శ్రీనివాసులు, ప్రసాద్, దండు వెంకట్రాముడు, వైసీపీ నాయకులు క్రిష్టప్ప, మీసాల రంగన్న, హరీష్ యాదవ్, బీసీ రమేష్, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు పార్థసారథి

ఇక్కడా రాజకీయమే..

రాజకీయాలకతీతంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకుడు ఓబుళపతి, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న రాజకీయాలను ప్రస్తావించారు. కళ్యాణదుర్గంలో వైసీపీ నుంచి పోటీ చేస్తున్న ఎంపీ తలారి రంగయ్యకు బీసీలు మద్దతివ్వాలని పిలుపునివ్వడం విమర్శలకు దారి తీసింది.

'జన్ భాగీదారి' ఘనంగా నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం టౌన్, జనవరి 13: సామాజిక సమతా సంకల్పంలో భాగంగా జిల్లాలో 'జన్ భాగీదారి' కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. శనివారం ఆమె వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో125అడుగుల డాక్టర్, బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తున్నారన్నారు. అందులో భాగంగా 19వరకు జిల్లాలో కూడా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 17న అన్నిప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలను శుభ్ర పరచి సుందరంగా ముస్తాబుచేసి పూలమాలలు వేయాలన్నారు. 18నఅన్నిప్రాంతాలలోను మానవహారాలు, రక్తదాన శిబిరాలు, ఫొటో ఎగ్జిబిషన్ , సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని, 19న 125అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణను రెవెన్యూభవన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని అందుకు తగిన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ



క్రీడాకారులతో కోచ్‌లు, అసోసియేషన్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13: జాతీయ పారా అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు మూడు పతకాలు దక్కాయి. గోవాలో నిర్వహించిన 22వ జాతీయ స్థాయిపారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు సాకే బాబు బంగారు పతకం, నీలం పల్లవి, సంజయ్‌రెడ్డిలు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన పారా క్రీడాకారులను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, శాప్ కోచ్ మంజుల, కోచ్ సురేష్ శనివారం అభినందించారు.

టీడీపీతోనే ఈడిగల అభ్యున్నతి : కాలవ

అనంతపురం అర్బన్, జనవరి 13 : టీడీపీతోనే ఈడిగల అభ్యున్నతి సాధ్యమవుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో కాలవ శ్రీనివాసులు, టీడీపీ ఈడిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అమర్‌నాథ్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఈడిగ సాధికారసమితి జిల్లా కమిటీని నియమించారు. ఆ సమితి జిల్లా అధ్యక్షుడిగా గొల్లపల్లి నాగరాజుగౌడ్‌ను నియమించారు. అలాగే ఉపాధ్యక్షుడిగా గాది లింగప్ప, పరంధామ, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం. నాగరాజు గౌడ్, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అశోక్, సభ్యులుగా రంగస్వామి, శ్రీనివాసులు, సురేష్, నరేష్, ఏకాంతప్ప, తిరుపాల్, ఆదినారాయణలను నియమించారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం సభ్యులు సమన్వయంతో రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.



ఈడిగ సాధికార సమితి జిల్లా నూతన కమిటీతో కాలవ శ్రీనివాసులు

రిపబ్లిక్‌డే పరేడ్‌కు జిల్లా వాసి

అనంతపురం కల్చరల్, జనవరి 13 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన ఢిల్లీలో నిర్వహించే పరేడ్‌లో యోగాసనాలు ప్రదర్శించేందుకు అనంతవాసికి అవకాశం దక్కింది. ఆయుష్మాన్ భారత్, ఆయుష్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో భాగంగా అనంతపురం నగరంలో 2వ రోడ్డులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకురాలుగా వ్యవహరిస్తున్న కటకం కృష్ణవేణికి ఈ అవకాశం దక్కింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాధిక్ ఖాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో కటకం కృష్ణవేణి యోగా ప్రదర్శన ఇవ్వనున్నారు.



కటకం కృష్ణవేణి

మా కష్టాలు ఇప్పుడు గుర్తొచ్చాయా..?

- ఎంపీ రంగయ్యపై శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు ఫైర్

కళ్యాణదుర్గం, జనవరి 13 : ఎంపీగా పనిచేస్తూ, ఏనాడు శ్రీరామిరెడ్డికార్మికుల కష్టాలు పట్టించుకోలేదని, ఇప్పుడెందుకు వచ్చారంటూ కార్మికులు ఎంపీ తలారి రంగయ్యను ప్రశ్నించారు. నీళ్లు రాకపోతే ఇప్పుడు మేము గుర్తొచ్చామా, జీతాలు ఇస్తేనే సమ్మెను విరమిస్తామని శ్రీరామిరెడ్డి కార్మికులు స్పష్టంగా ఎంపీకి తేల్చిచెప్పారు. శనివారం కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద సమ్మె చేస్తున్న శ్రీరామిరెడ్డి కార్మికుల దగ్గరకు ఎంపీ తలారి రంగయ్య వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో రెండు నెలల జీతాలు మంజూరు చేయిస్తామని, సమ్మెను విరమించాలని కార్మికులను ఆయన కోరారు. అయితే కార్మికులు ఏ మాత్రం ఒప్పుకోలేదు. ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ ఖరాఖండిగా ఎంపీ తలారి రంగయ్యకు తేల్చి చెప్పారు. దీంతో ఆయన విన్నంతసేపు విని...అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్మికులతో చర్చలు విఫలం అయ్యాయి. గతంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కూడా ఒకసారి చర్చలు జరిపినప్పటికీ విఫలం అయ్యాయి. మరోసారి ఎంపీతో కూడా చర్చలు విఫలం అయ్యాయి. కార్మికులు కూడా అదరం..బెదరం...అంటూ ఏ మాత్రం మెట్టు దిగకుండా సమ్మెను యథావిధిగా కొనసాగిస్తున్నారు. సంక్రాంతి పండుగకు కూడా పస్తులుండాల్సిందేనని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 325 గ్రామాల్లో దాహార్తి కేకలతో గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. కేవలం ఒక్క నెల జీతాలు మాత్రమే మంజూరు చేశారని కార్మికులు వాపోయారు. మిగిలిన నాలుగు నెలల జీతాలు మంజూరు చేస్తేనే సమ్మెను విరమిస్తామని తెగేసి చెబుతున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో సుమారు 225 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికీ జీతాలు మంజూరు కావాలి. వేతనంతో పాటు, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించాలని వారు కోరుతున్నారు. పూర్తి వేతనాలు మంజూరు చేయాల్సిందేనని తెగేసి చెప్తున్నారు.



ఎంపీతో వాగ్వాదం చేస్తున్న కార్మికులు

రిజర్వాయర్‌కు 355 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 13: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 355 క్యూసెక్కులు వస్తున్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 355 క్యూసెక్కులు వుండగా ఇక్కడి నుంచి ఫేజ్-2కు ఔట్‌ఫ్లో కింద 540 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటినిల్వ 0.588 టీఎంసీలు వుందని వెల్లడించారు.

సీఎం జగన్‌కూ కేసీఆర్ గతే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, జనవరి 13: తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే మన రాష్ట్రంలో సీఎం జగన్‌కు కూడా పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జోస్యం చెప్పారు. నగరంలోని లలిత కళా పరిషత్‌లో శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రామకృష్ణతోపాటు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ అప్పులు చేసి, ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రాజెక్టులు, కాలువలు, ఇళ్ల నిర్మాణాలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధే లేదు. అభివృద్ధి జరగాలంటే జగన్‌ను సాగనంపాల్సిందే నన్నారు. కేంద్రం మత రాజకీయాలు చేస్తోందని, ఎదురు మాట్లాడిన వారిని బ్లాక్ మెయిల్ చేయడమేకాకుండా కేసులు పెట్టి జైళ్లలో పెడుతోందన్నారు. బ్యాంకులు దోచిన బడా బాబులకు కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. ఈ పదేళ్లలోనే ఏకంగా రూ.156 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ సొమ్మంతా నరేంద్ర మోదీ తన అనుచరులకు దోచి పెట్టారని మండిపడ్డారు. కేంద్రంలో ప్రతిపక్షపాత్ర పోషించాల్సిన కాంగ్రెస్ ఒంటెద్దు పోకడ ప్రదర్శిస్తోందన్నారు. జగదీష్ మాట్లాడుతూ వైసీపీని గద్దె దించితేనే అభివృద్ధి, ఉద్యోగాలు సాధ్యం అవుతాయన్నారు. బీజేపీ విషనాగు అని, ఇన్నాళ్లు వైసీపీ తో పెనవేసుకుని , ఎన్నికల వేళ టీడీపీపై కపట ప్రేమ చూపుతోందన్నా రు. వ్యతిరేక ఓట్లు చీల్చి ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని వైసీపీ చూస్తోందని, ప్రతిపక్షాలన్నీ ఐక్యం కావాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎంవీ రమణ, జిల్లా సహాయకార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గసభ్యులు లింగమయ్య, కేశవరెడ్డి, రవీంద్రనాథ్, జాన్సన్, నారాయణస్వామి, పెద్దయ్య, మల్లికార్జున, సంజీవప్ప, రమణ, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

సమ్మెను విజయవంతం చేయండి

పట్టు రైతు సంఘం నాయకులు

అగళి, జనవరి 13 : హిందూపురం మార్కెట్ ఎదురుగా ఈ నెల 17 నుంచి రైతులు, రీలర్లు, చేపడుతున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని పట్టు రైతు సంఘం నాయకులు శనివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టుగూళ్ల మార్కెట్‌లో గూళ్లు అమ్మిన రైతులకు, కొనుగోలు చేసిన రీలర్లకు ప్రభుత్వం అందించే ఇన్సెంటివ్ నాలుగేళ్లుగా రూ.కోట్లలో బకాయి పడిందని పేర్కొన్నారు. దానిని ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ పలుమార్లు పట్టుపరిశ్రమ శాఖ కమిషనర్, సీఎం సలహాదారుల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకుండా పోయిందన్నారు. ఈ విషయమై హిందూపురం మార్కెట్ ఎదురుగా ఈనెల 17నుంచి రైతులు, రీలర్లు, నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో రైతులు, రీలర్లు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు ప్రకటనలో కోరారు. ఈ శాంతియుత సమ్మెకు అధికారులు సహకరించాలన్నారు. సమ్మె సమయంలో మార్కెట్‌లో గూళ్ల అమ్మకాలు, కొనుగోళ్లు ఉండవన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులు గమనించాలని పేర్కొన్నారు.

ఏపీపీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇందాద్



హిందూపురం, జనవరి 13 : రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా హిందూపురం ఏపీపీ ఇందాద్‌ను ఎన్నుకున్నట్లు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులో శుక్రవారం 13 ఉమ్మడిజిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. మారు తున్న కాలంతోపాటు చట్టాలపట్ల అవగాహనను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకునే అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీపీ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన వజ్రాల రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హిందూపురానికి చెందిన డీఎండీ ఇందాద్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్నికతో తన బాధ్యత పెరిగిందని పేద ప్రజలకు న్యాయం అందిస్తామన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం, జనవరి 13 : పట్టణ పరిధిలోని కొట్నూరులో శనివారం లైఫ్ విక్టరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. వైద్య శిబిరంలో వంద మందికిపైగా వైద్య సేవలు పొందారు. వీరిలో 70మందికి రక్తపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకన్య మాట్లాడుతూ... గ్రామీణులు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కర్ణాటకవాసి ఆత్మహత్య



సతీష్ (ఫైల్)

పెనుకొండ రూరల్, జనవరి 13 : ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి, అప్పుల బాధ తాళలేక పెనుకొండ సమీపంలోని మడకశి ర రహదారిలో పాత సుంకులమ్మ ఆలయం వద్ద సతీష్(45)అనే లారీ డ్రైవర్ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన సతీష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సతీష్ తాడిపత్రి నుంచి సిమెంటును మంగళూరుకు తరలించేవాడు. అయితే ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అల వాటుపడిన సతీష్‌కు అప్పులు అధికమయ్యాయి. దీంతో పండగకు ఇంటికెళ్తే అప్పుల వాళ్లు వచ్చి గొడవ చేస్తారని మనస్తాపానికి గుర య్యాడు. పెనుకొండ సమీపంలోని పాత సుంకులమ్మ ఆలయం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఇది హత్యా , ఆత్మహత్యా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉందని స్థానికులు అంటున్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ

గోరంట్ల, జనవరి 13: మండలకేంద్రంలోని సంతమార్కెట్ సమీపంలో నివాసముంటున్న నిరుపేద వికలాంగుడు ఉత్తప్పకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు జగదీశ్వర్ శనివారం ట్రై సైకిల్‌ను వితరణ చేశారు. ఉత్తప్ప పక్షవాతం కారణంగా చికిత్స చేయించుకోలేని నిస్సహాయ స్థితిలో అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో సాయమందించలేక బాధపడుతుండడం ఉపాధ్యాయుడు గుర్తించారు. పుట్టపర్తి సత్యసాయి భక్తురాలొకరు ఆర్థికసాయం అందించగా రూ.11వేల విలువ చేసే ట్రై సైకిల్‌ను ఉత్తప్పకు అందించారు.

ఇంటిపై దాడిచేశారని మహిళ ఫిర్యాదు



తలుపులు తొలగించిన రామాంజనమ్మ ఇల్లు

గోరంట్ల, జనవరి 13: మండలంలోని ఎం కొత్తపల్లికి చెందిన గొల్ల రామాంజనమ్మ శనివారం అదే గ్రామానికి చెందినవారు తన ఇంటిపై దాడిచేసి తలుపులు ధ్వంసం చేసినట్లు గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ద్వారా సంక్ర మించిన ఇంటిని తన సోదరుడు మల్లికార్జున తాగిన మైకంలో ఉన్నప్పుడు అదే గ్రామానికి చెందిన సుబ్బమ్మ పేరున రాయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తాను కోర్టును ఆశ్రయించానన్నారు. ఇలా ఉండగా ఇల్లు ఖాళీ చేయమంటూ తరచూ చేసే దౌర్జన్యం చేసేవారన్నారు. ఇళ్లు ఖాళీ చేయలేదని సుబ్బమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దాడి చేసి ఇంటి రెండు తలుపులు ధ్వంసం చేసిందన్నారు. ప్రధానమంత్రి పర్యటన పర్యవేక్షణలో అధికారులుండడంతో తరువాత రావాలని పోలీసులు సూచించారు. అయితే తలుపులు లేని ఇంట్లో తాను ఎలా ఉండాలంటూ ఇంటికెళ్లకుండా స్టేషన్ వద్ద పొద్దు పోయేవరకు ఆమె వేచి ఉన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

పెనుకొండ రూరల్, జనవరి 13 : మండలంలోని గుట్టూరులో శుక్రవారం రాత్రి ఓ చోరీ నిందితుడికి దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన మేరకు... గుట్టూరులోని పాత జాతీయ రహదారి పక్కన ఓ కంపెనీ కార్యాలయంలో తాళాలు వేసి ఉండగా ... కొత్తచెరువుకు చెందిన కంపెనీలో పనిచేసే కార్మికుడు మద్యం తాగి ఆతాళాలు పగులగొట్టాడు. కంపెనీలోకి చొరబడి అందులోని వస్తువులు అపహరించడానికి ప్రయత్నించాడు. స్థానికులు గమనించి అతడికి దేహశుద్ధి చేసి కియ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. జరిగిన ఘటనపై కియ పోలీసులు విచారణ చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

మడకశిర టౌన్, జనవరి 13 : మడకశిర నగర పంచాయతీ పరిధిలోని వజ్రపాళ్యం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం కర్ణాటక ప్రాంతం నుంచి ఆంధ్రా తరలిస్తున్న మద్యం ప్యాకెట్లను పట్టుకొన్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. కర్ణాటక నుంచి అతడు తీసుకొస్తున్న 17 ఓటీ బాటిల్స్ స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా ఈ నెల దాదాపు 11 ఎక్సైజ్ కేసులు, 12 మట్కా కేసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.



సందడిగా ఉన్న పురం మార్కెట్



విక్రయానికి సిద్ధంగా పలు రకాల సరుకులు

సంక్రాంతి పండుగ సందడి

హిందూపురం, పెనుకొండలో జోరుగా విక్రయాలు



పావగడలో...

హిందూపురం అర్బన్/పెనుకొండ /పావగడ, జనవరి 13: సంక్రాంతి పండుగ సందడి జోరుగా కనిపిస్తోంది. ఆదివారం నుంచి భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడురోజుల పాటు జరుపుకునేం దుకు పట్టణా లతో పాటు మండ లాల్లోని గ్రామాల ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా హిందూపురం, పెనుకొండ పట్టణాల్లోని వ్యాపారులు పండుగకు అవసరమైన సరుకులతో విక్రయానికి సిద్ధంగా ఉన్నారు. రం గులు, చెరుకుగడలు, పండ్లు, పూలు, గుమ్మడి కాయలు, అనుపకా యల, శనక్కాయలు, కాయగూరల వ్యాపారాలతో ఆయా పట్టణాలతో పండుగ సందడి నెలకొంది. శనివారం కొనుగోలు దారులతో పట్టణాల ప్రధాన వీధులు కిటకిటలాడాయి. అయితే ధరలు ఆకాశాన్నంటాయి. ముగ్గులను అలంకరించేందుకు రంగుల కొనుగోలుపై మగువలు మొగ్గు చూపారు. అలాగే కర్ణాటకలోని పావగడ పట్టణంలో పండుగ సందడి నెలకొంది. కొనుగోలు దారులతో పట్టణం కిటకిటలాడింది.



పెనుకొండలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పూల దుకాణం



రోడ్డును కప్పేసిన పొగమంచు



ఉదయం 8గంటలప్పుడు లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనం

కమ్మేసిన పొగ మంచు

ఉదయం 8దాటినా కనిపించని సూర్యుడు

పల్లె వళ్లు విచుకునేవేళ మంచు పరదా తొలగలేదు. దట్టమైన పొగమంచును దాటి రాలేక సూర్యుడు బద్దకించాడు. బారెడు పొద్దెక్కినా శనివారం ఉదయం మంచు ముసుగు తొలగలేదు. ఈ శీతాకాలంలో పురం ప్రాంతంలో ఇంతలా మంచు కురిసింది ఇదేనేమో. మంచు కురిసిన సమయంలో రహదారుల్లో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తెల తెల్లవారుజామునుంచి ఉదయం 8గంటల వరకు మంచు కురుస్తుండటంతో పదడుగుల దూరంలో ఉన్న మనిషి కూడా కనిపించనంత మంచు కప్పేసింది.

- హిందూపురం

హెడ్ కానిస్టేబుల్ దాడిచేశాడంటూ..

జూనియర్ న్యాయవాది ఫిర్యాదు

హిందూపురం, జనవరి 13 : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే హెడ్‌కానిస్టేబుల్ మహేష్ తనపై దాడిచేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు జూనియర్ న్యాయవాది ఎంఎస్ఎఫ్ రవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ... కోర్టులో ఓ ద్విచక్రవాహనాన్ని విడిపించే కేసులో హెడ్ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేశానన్నారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ మహేష్ తరచూ తనను బెదిరించేవాడన్నారు. ఈ పరిస్థితుల్లో శనివారం మధ్యాహ్నం పట్టణంలోని ఓ ఫైనాన్స్ వద్ద ద్విచక్రవాహనం ఉంచి ఫైనాన్స్‌కు సంబంధించి మాట్లాడేందుకు వెళ్లానన్నారు. అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ తనను దుర్భాషలాడుతూ అక్కడి నుంచి కిందకు లాక్కొచ్చి దాడి చేశాడన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని, తనపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాది పేర్కొన్నారు.

వైసీపీ నాయకుడిపై దాడికి యత్నం

కార్యకర్తను అడ్డుకున్న పోలీసులు

రొద్దం, జనవరి 13 : మండలంలోని దొడగట్ట గ్రామంలో వైసీపీ నాయకుడు బీ నారాయణరెడ్డిపై అదే పార్టీ కార్యకర్త ఈడిగ పురుషోత్తం ఆక్రోశంతో చెప్పుతో దాడికి యత్నిం చాడు. మండల పరిధిలోని దొడగట్ట గ్రామంలో శనివారం రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ పర్యటనలో భాగంగా రోడ్‌షో చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈడిగ పురుషోత్తం ఇంటివద్ద వెళ్తున్నారు. అందులో పాల్గొన్న రాష్ట్ర స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ బీ నారాయణరెడ్డిపై పురుషోత్తం చెప్పుచూపుతూ దాడి చేసేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులు అప్రమత్తమై నివారించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి వర్గీయులు సైతం ప్రతిదాడికి దిగేందుకు ప్రయత్నించగా పోలీసులు అప్రమత్తమై పురుషోత్తంను వారి ఇంటిలోకి పంపి తలుపులు వేశారు. మంత్రి ఉషశ్రీ ఎదుటే ఈ సంఘటన చోటుచేసుకోగా ఆమె అవాక్కయ్యారు. అనంతరం ఆమె అదే గ్రామంలో సర్పంచ్ బాలాజీ ఇంట్లో నాయకులతో సమావేశమై ఇలా చేయడం మంచిదికాదని ఏదైనా సమస్య ఉంటే చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. మరలా ఇలా రిపీట్ అయితే సస్పెండ్ చేస్తామని నాయకులను మంత్రి హెచ్చరించినట్లు సమాచారం. శంకర్‌నారాయణ వర్గీయులు, అసమ్మతి వర్గీయుల మధ్య కొన్నేళ్లుగా వర్గపోరు నడుస్తోంది. ఈ వర్గపోరు మంత్రికి తలపోటుగా మారిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వివాహేతర బంధం తెచ్చిన తంటా

వ్యక్తిపై కత్తితో దాడి

హిందూపురం, జనవరి 13: వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన దాడిలో నాగరాజ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ముదిరె డ్డిపల్లిలో నివాసముంటున్న మహిళతో మరో వ్యక్తి వివాహేతర సంబం ధం కలిగిఉందన్న అనుమానమే ఈ ఘటనకు కారణమని వన్ టౌన్ ఎస్ఐ హారుణ్‌బాష తెలిపారు. నిందితుడు కత్తితో దాడి చేయడంతో కడుపు భాగంలో తీవ్ర గాయాలపాలైన నాగరాజుకు పురం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం బెంగళూరుకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

'ఒంటరి మహిళలకు ఆర్డీటీ అండ'



ఒంటరి మహిళలకు సరుకులను పంపిణీ చేస్తున్న విశాల ఫెర్రర్

అగళి, జనవరి 13 : చిన్న వయసులోనే భర్త కోల్పోయిన మహిళలకు ఆర్డీటీ అండగా ఉంటుందని ఆ సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్డీటీ భవనంలో శనివారం అగళి, రొళ్ల మండలాల్లో చిన్న వయసులోనే భర్త కోల్పోయిన 68 మంది మహిళలతో సింగల్ మదర్స్ అనే అంశంపై ఆమె మాట్లాడారు. వారి పిల్లలకు ఆర్డీటీ అందిస్తామన్నారు. కుటుంబంలో సమాజంలో మీరు మంచి ప్రవర్తన కలిగి మీ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నారు. అనంతరం రెండు నెలలకు సరిపడ ఆహార వస్తువులను విశాలఫెర్రర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా టీమ్‌లీడర్ ఓబులేసు, బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారం జోరు - ఆచరణ శూన్యం

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సిబ్బంది కొరత

రోజూ వచ్చి వెనుదిరుగుతున్న వినియోగదారులు



సిబ్బంది లేని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

మడకశిర రూరల్, జనవరి 13 : బీఎస్ఎన్ఎల్ సిమ్ ఉన్న ప్రతి వినియోగదారుడు ఉచితంగా కార్యాలయంలో కేవైసీ చేయించుకోవాలని ఆ సంస్థ ప్రచారం ముమ్మరంగా చేస్తోంది. ప్రతి ఫోన్‌కాల్‌కు బీఎస్ఎన్ఎల్ ప్రచారం వస్తోంది. దీంతో సిమ్‌కు సంబంధించి కేవైసీ చేయించుకోవడానికి పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి వినియోగదారులు రోజూ కార్యాలయం వద్దకు వచ్చి అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీనికి కారణం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో పనిచేసే చాలా మంది అధికారులు, సిబ్బంది పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో కొత్తవారు రాలేదు. దీంతో ప్రస్తుతం కార్యాలయంలో ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. వారు కూడా కేబుల్ ఆపరేటర్లు. దీంతో సిమ్‌కు సంబంధించి కేవైసీ చేసేవారు లేరని ప్రజలు వాపోతున్నారు.

వసతులు కల్పించనప్పుడు ప్రచారం ఎందుకు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉచితంగా కేవైసీ చేయించుకోవాలని సెల్ ఫోన్‌లో ముమ్మరంగా ప్రచారం వస్తోంది. దీంతో నేను మడకశిరలోని కార్యాలయం వద్దకు వెళ్లాను. అయితే కార్యాలయంలో అధికారులు ఎవ్వరూ లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగాను. ప్రైవేట్ ఏజెన్సీలతో కేవైసీ చేయించుకోవలంటే సిమ్‌కు రూ.50 చెల్లించాలి. ప్రభుత్వం ఉచితంగా కేవైసీ చేయనప్పుడు ప్రచారం ఎందుచేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్‌కు సంబం ధించిన ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కావలసినంత సిబ్బందిని నియమించాలి. వినియోగదారులకు ఉచిత సేవలు అందించాలి.

- సంజీవప్ప గౌరిపురం

పరమాన్నాలు మీకు.. గడ్డి మాకా?

ప్రభుత్వంపై మండిపడ్డ అంగన్‌వాడీలు



కనుమ ఆలయంలో జ్యోతులతో అంగన్‌వాడీల ప్రదక్షిణలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

పండుగ వేళ పంచభక్ష పరమా న్నాలు మీకు ఎండు గడ్డి మాకా అని అంగన్‌వాడీలు పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా 33వ రోజు శనివారం నిరసన కొనసాగించారు. పురంలో గడ్డి తింటూ నిరసన చేపట్టారు. దేశమంతా సంక్రాంతి పండుగను సందడిగా చేసుకుంటున్నా ఏపీలో అంగన్‌వాడీలకు మాత్రం ఆ భాగ్యం లేదని ఆవేదన చెందారు. పండుగపూట వైసీపీ నాయకులు కుటుంబ సభ్యులతో పంచభక్ష పరమా న్నాలు భుజిస్తుంటే మేము గిడ్డి తినాల్సి వస్తోందని విమర్శించారు. ఒక్క ఛాన్సు ఇచ్చినందుకే ఇన్ని కష్టాలు పెడుతున్న తమకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. గోరంట్లలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం తమపీక పిసికి చంపేయమంటూ అంగన్‌వాడీలు తమ రెండుచేతులతో గొంతుపట్టుకుని నిరసన తెలిపారు. లేపాక్షిలో వేపాకు తింటూ జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మడకశిర పట్టణం, సోమందేపల్లి, రొళ్ల, గుడిబండలో నిరసన కొనసాగించారు. అగళిలో మానవహారంగా కూర్చుని చేతులు ముడుచుకుని నిరసన తెలిపారు. రొళ్లలో టీడీపీ నాయకుడు వీఎం పాండురంగప్ప మద్దతు పలికారు.

జ్యోతుల ఉత్సవంతో అంగన్‌వాడీల మొక్కులు

ప్రభుత్వం తమకు న్యాయం చేసేలా సీఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం చిలమత్తూరు మండలంలోని కనుమలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జ్యోతుల ఉత్సవం చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, జ్యోతులతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

సంతకాల సేకరణ

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పంపేందుకు పెనుకొండలో అంగన్‌వాడీలు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. సమ్మెకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత సీపీఎం నాయకులు హరి తదితరులు సంఘీభావం తెలుపుతూ సంతకాలు చేశారు.



అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సంతకాలు చేస్తున్న సవిత తదితరులు

భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం



భోగిమంటల్లో జీఓ ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

గుడిబండ : అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న స మస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెను నీరు గార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగిస్తూ జీఓను విడుదల చేసిందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జీఓ ప్రతులను అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం స్థాని సీడీపీఓ కార్యాలయం ఎదుట భోగి మంటల్లో వేసి కాల్చివేశా కాల్చివేశారు. అంగనవాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పింఛన్‌ను అందించి ఆదుకోండి

ఓ దివ్యాంగుడి వేడుకోలు



పింఛన్ రాలేదంటున్న దివ్యాంగుడు వీపీ చిన్న

గుడిబండ, జనవరి 13 : తనకు దివ్యాంగ పింఛన్ అందించి ఆదుకోవాలని మండలం లోని కొంకల్లు గ్రామానికి చెందిన వీపీ చిన్న కోరుతున్నాడు. అతడు విలేకరుల వద్ద శనివారం మాట్లాడతూ... నాలుగు నెలల క్రితం తనకు దివ్యాంగ పింఛన్ మంజూరైందని తెలపారు. అలాగే నాలుగు నెలల పాటు తనకు పింఛన్‌ను అందించారని అన్నాడు. అయితే జనవరి నెలలో పింఛన్ రాలేదని ఈ సారి వలంటీర్లు, అధికారులు తెలియజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అన్ని విధాలా అర్హుడినైన తనకు పింఛన్‌ను ఇప్పించి ఆదుకోవాలని అధికారులను కోరారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు

ఏఐటీయూసీ నాయకులు



ఏఐటీయూసీలో చేరిన కార్మికులతో నాయకులు

పెనుకొండ, జనవరి 13 : కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ఏఐటీయూసీ నిర్విరామ పోరాటం చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం 20మంది పంచాయతీ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఆంజనేయులు వారికి ఏఐటీయూసీ కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. అనంతరం ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తామన్నారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు, పట్టణ కార్యదర్శి వెంకటేష్, భవన కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, ఆటో యూనియన్ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, నారాయణప్ప, మహిళా సంఘం నాయకులు వెంకటలక్ష్మమ్మ, మునిసిపల్ కార్మికులు గజేంద్ర, నరేష్, భావక్క, గంగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.